క్లుప్తంగా

కేసు నమోదు

వీరఘట్టం: మండలంలోని తూడి గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ ఫక్రుద్దీన్ శనివారం తెలిపారు. అలాగే గ్రామ సచివాలయం రెయిలింగ్ విరగగొట్టడంపై కూడా కేసు నమోదు చేశామన్నారు. ఈ రెండు కేసులపై వేర్వేరుగా దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అనారోగ్యంతో గిరిజన విద్యార్థి మృతి

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని బాలేసు పంచాయతీ బయ్యాడ గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థి బి.ఈశ్వరరావు(15) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. విద్యార్థి జియ్యమ్మవలస మండలం రావాడ రామభద్రాపురం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవుల అనంతరం పాఠశాల పునఃప్రారంభమవ్వడంతో పాఠశాలకు వచ్చి మరలా ఇంటికి వెళ్లిపోయాడని, తదనంతరం అనారోగ్యం కారణంగా ఈశ్వరరావు మృతి చెందినట్లు సమాచారం

శ్రీవారి సేవలో జీసీసీ ఎం.డి



అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో జీసీసీ ఎం.డి సురేష్‌కుమార్

సీతంపేట: తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో సీతంపేటలో నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని జీసీసీ ఎం.డి జి.సురేష్‌కుమార్ శనివారం సందర్శించారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాదాన్ని వడ్డించారు. ఆయనతో పాటు జీసీసీ డీఎం సంధ్యారాణి, సీతంపేట, పాతపట్నం జీసీసీ బ్రాంచ్ మేనేజర్లు దాసరి కృష్ణ, గొర్లె నరసింహులు, తదితరులు ఉన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత



బాధితునికి సెల్‌ఫోన్ అప్పగిస్తున్న పోలీసులు

వీరఘట్టం: ఆరు నెలల క్రితం పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను శనివారం బాధితునికి స్థానిక పోలీసులు అప్పగించారు. వీరఘట్టం మండలం యు.వెంకమ్మపేట గ్రామానికి చెందిన వాన ప్రవీణ్ ఈ ఏడాది జనవరిలో తన ఇంటి నుంచి వీరఘట్టం వస్తుండగా మార్గ మధ్యలో ఫోన్ పోగొట్టుకున్నాడు. వెంటనే ఆన్‌లైన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటి నుంచి పోలీసులు ఐఎంఈఐ నంబరు ద్వారా ఆ ఫోన్‌ను ట్రాక్ చేశారు. జియ్యమ్మవలసలో ఉన్నట్లు గుర్తించి శుక్రవారం ఆ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై ఫక్రుద్దీన్, ఏఎస్సై కృష్ణంనాయుడు శనివారం బాధితుడు ప్రవీణ్‌కు ఫోన్‌ను అందజేశారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ భానుప్రతాప్, తదితరులు

సీతంపేట: స్థానికంగా ఉన్న మినీగురుకుల పాఠశాల, ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం దోనుబాయి పీహెచ్‌సీ వైద్యాధికారులు భానుప్రతాప్, శివశంకర్ వైద్యసేవలు అందించారు. ప్రతీ విద్యార్థికి వైద్య పరీక్షలు చేశారు. జ్వరం, ఇతర అనారోగ్య లక్షణాలతో బాధపడుతున్న వారికి మందులు అందజేశారు. వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ జె.మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికీ చేరువకావాలి

భామిని: నీతి అయోగ్ సూచనలతో అమలు చేస్తున్న కార్యక్రమాలు ప్రతి ఒక్కరికీ చేరువయ్యేలా చర్యలు చేపట్టాలని నీతి అయోగ్ కేంద్ర పరిశీలకురాలు అనితా మజ్జి, పార్వతీపురం మన్యం జిల్లా సీపీఓ పి.వీర్రాజు అన్నారు. భామిని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కిశోర్‌కుమార్, మండల కోఆర్డినేటర్ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన సంపూర్ణత అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఏస్పిరేషనల్ బ్లాక్, డిస్ట్రిక్ట్ కార్యక్రమం కింద రాష్ట్రంలో ఎంపికైన మూడు మండలాల్లో భామిని ఒకటని వివరించారు. జూలై నుంచి సెప్టెంబర్ 30 వరకు కేంద్ర ప్రభుత్వ నిధులతో 5 విభాగాల్లో చేపడుతున్న పథకాలు విస్తృతపరచి 40 ఇండికేటర్స్ ద్వారా ప్రగతి గుర్తింపు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసి ప్రకృతి వ్యవసాయ పంటల ప్రదర్శన, నవధాన్యాల చక్రం, విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. డీఈఓ గార పగడాలమ్మ, ఏడీఓ కె.రత్నకుమారి, ఎస్‌పీఎం డీపీఎం షణ్ముఖరాజు, మండల ప్రత్యేక ఆహ్వానితులు తోట సింహాచలం పాల్గొన్నారు.

రథయాత్రకు సర్వం సిద్ధం

- నేటి నుంచి 15 వరకు రథయాత్ర
- భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు



వీరఘట్టం: రథయాత్రకు ముస్తాబైన సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామి

వీరఘట్టం: మండల కేంద్రంలో ఏటా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జగన్నాథస్వామి రథయాత్ర మహోత్సవాలను ఈ ఏడాది వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆదివారం నుంచి 15వ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయని, స్వామివారు ప్రతిరోజు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తారని దేవాదాయశాఖ ఈఓ సర్వేశ్వరరావు, అర్చకులు లింగరాజ్‌రథో తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమాలు, రథయాత్రలో పాల్గొని ఆ జగన్నాథస్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

కన్నుల పండుగగా జగన్నాథుని నేత్రోత్సవం

స్థానిక మందిరం వీధిలో వెలసిన జగన్నాథస్వామి ఆలయాన్ని శనివారం సంప్రోక్షణ చేశారు. అనంతరం స్వామివారికి నేత్రోత్సవం నిర్వహించారు. ఆదివారం నుంచి జగన్నాథస్వామి రథయాత్ర ప్రారంభమవుతుంది. 11న హీరాపంచమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, 15న మారు రథయాత్ర ఉంటాయని అర్చకులు తెలిపారు.



స్వామివారి యాత్రకు ముస్తాబైన రథం

పాలకొండ రూరల్: జగన్నాథుని రథయాత్రకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ సర్వేశ్వరరావు తెలిపారు. ఆదివారం నుంచి ప్రారంభమయ్యే రథయాత్ర ఏర్పాట్లు, ఉత్సవాల నిర్వహణపై దేవాదాయశాఖ సిబ్బంది, అర్చకులతో శనివారం సమీక్షించారు. 10 రోజుల పాటు జరగనున్న ఈ యాత్రలో భక్తులకు ఎటువంటి సమస్యలు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పారిశుధ్యం, విద్యుత్ అలంకరణ, భక్తుల భద్రత, మౌలిక సదుపాయాల కల్పనపై సమీక్ష కొనసాగింది. అనంతరం క్షేత్ర స్థలంలో స్టాల్స్ ఏర్పాటును పరిశీలించారు.

భామిని: మండలంలోని బత్తిలిలో ఉన్న జగన్నాథ మందిరం వద్ద ఆదివారం నుంచి తొమ్మిది రోజుల పాటు రథయాత్ర ఉత్సవాలు నిర్వహణకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. జగన్నాథ, బలభద్ర, సుభద్రల విగ్రహాల ఊరేగింపునకు అవసరమైన రథాన్ని శనివారం సిద్ధం చేశారు. యాత్రకు ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది.



పాలకొండ రూరల్: యాత్రస్థలంలో సిబ్బందితో చర్చిస్తున్న ఈఓ

వైఎస్సార్ జయంతి రేపు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

భామిని: ఈ నెల 8న దివంగత డాక్టర్ వైఎస్సార్ 75వ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలంతా తరలిరావాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు మజ్జి మోహనబాబు పిలుపునిచ్చారు. భామినిలో పార్టీ ముఖ్య నాయకులతో శనివారం సమావేశమై చర్చించారు. కొరమ కూడలిలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి రంగులు వేసి, పరిసరాలను శుభ్రం చేసినట్లు చెప్పారు. అలాగే ఈ నెల 9న మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి నివాసంలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం జరుగుతున్న ఈ సమావేశానికి ప్రతీ గ్రామం నుంచి పార్టీ కార్యకర్తలు హాజరు కావాలని కోరారు. జేసీఎస్ మండల కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, బీసీ సెల్ అధ్యక్షుడు అగతముడి రఘు, బాలేరు, పెద్దదిమిలి, మనుమకొండ సర్పంచ్‌లు జామి ప్రభాకర్, తొగరాన శ్రీను, నిమ్మల కేశవ, పార్టీ నాయకుడు బోడ్డేపల్లి ప్రసాద్ ఉన్నారు.

పరామర్శ



గురునాథరావు కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న కళావతి, తదితరులు

పాలకొండ రూరల్: మండలంలోని అన్నవరం గ్రామ మాజీ సర్పంచ్ గవర గురునాథరావు మరణం తీరని లోటని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నాయకురాలు విశ్వాసరాయి కళావతి అన్నారు. ఎంపీపీ బొమ్మాళి భాను, పార్టీ పట్టణ అధ్యక్షుడు వెలమల మన్మథరావుతో కలిసి గురునాథరావు కుటుంబాన్ని శనివారం ఆమె పరామర్శించారు. ఆయన మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని సంతాపం తెలియజేశారు. ఆమె వెంట సర్పంచ్ గవర రాజశేఖర్, వైస్ ఎంపీపీ వాకముడి అనీల్‌కుమార్, సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షుడు తిర్లంగి ఉపేంద్రకుమార్, ఎంపీటీసీ మజ్జి నవీన్‌కుమార్, కౌన్సిలర్లు కడగల వెంకటరమణ, నీలాపు శ్రీను, కిల్లారి మోహనరావు, భాసూరు కాంతారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు వారాడ దుర్గారావు, గవర దుర్గారావు, వారాడ చంద్రశేఖర్, తదితరులున్నారు.

ఎండుతున్న నారుమడులు

సీతానగరం: ఖరీఫ్ సీజన్‌లో అనుకున్నంత స్థాయిలో వర్షాలు పడకపోవడంతో నారుమడులు ఎండిపోతున్నాయి. మండలంలోని కేఎస్ పురం, వెన్నెలబుచ్చింపేట, దయానిధిపురం, రంగంపేట, పీటీపేట, జానుమల్లువలస, వెంకటాపురం, తదితర గ్రామాల్లో వర్షాధారంపై ఆధారపడి వ్యవసాయం చేస్తుంటారు. ఇటీవల పడిన కొద్దిపాటి వర్షానికి రైతులు నారుమడులు వేశారు. ఆ తర్వాత వరుణుడు ముఖం చాటేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నారుమడులు ఎండిపోతుండడంతో ట్యాంకర్ల ద్వారా నీటి తడులు అందిస్తున్నామని రైతులు చెబుతున్నారు. మరికొద్ది రోజుల్లో వర్షాలు కురవకపోతే ఖరీఫ్‌పై ఆశలు వదులుకోవాల్సిందేనని వాపోతున్నారు.

కొండాపురంలో గ్రామసభ



ఎరువులు పంపిణీ చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

పాలకొండ: మండలంలోని కొండాపురంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై పలు తీర్మానాలు చేశారు. గ్రామంలోని సమస్యలపై చర్చించారు. పంచాయతీ ఆదాయం పెంచేందుకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు.

స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీ

పాలకొండ: మండలంలోని కొండాపురం రైతుభరోసా కేంద్రం వద్ద శనివారం రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. సర్పంచ్ ప్రతినిధి రాయి రామకృష్ణ, ఎంపీటీసీ ప్రతినిధి కరణం నారాయణరావు, గ్రామ పెద్దల చేతులమీదుగా వ్యవసాయశాఖ సిబ్బంది రైతులకు ఎరువులు అందజేశారు. పంటకు ఎంత మోతాదులో ఎరువులు వేసుకోవాలో రైతులకు అవగాహన కల్పించారు.

ట్రాఫిక్ రూల్స్ పాటిద్దాం.. రోడ్డు ప్రమాదాలు అధిగమిద్దాం..

పాలకొండ రూరల్: మోటార్ వెహికల్ చట్టాలను ప్రతీ ఒక్కరు కచ్చితంగా పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎ.విజయ రాజ్‌కుమార్ అన్నారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో శనివారం మోటార్ వెహికల్ చట్టాలపై బార్ అసోసియేషన్ సిబ్బందికి అవగాహన కల్పించారు. నిబంధనలు అతిక్రమించిన, ప్రమాదాలకు కారణమైన, నిర్లక్ష్యంగా వాహనాలు నడిపే వారిపై తీసుకోవాల్సిన చట్టపరమైన చర్యలపై అవగాహన కల్పించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, హెల్మెట్, సీట్ బెల్ట్‌లను ధరించి వాహనాలు నడపాలన్నారు. కార్యక్రమంలో కోర్టు సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, లీలారాణి, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

కురుపాం: తాగునీరు, రహదారి సమస్య పరిష్కరించాలని మండలంలోని జి.శివడ పంచాయతీలోని లాలగాడిగూడ, ఈతమానుగూడ గిరిజన గ్రామాలకు చెందిన గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు మహిళలు బిందెలతో శనివారం నిరసన తెలియజేశారు. తాగునీటి కోసం కిలోమీటర్ దూరంలో ఉన్న గెడ్డ నుంచి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోందని, రహదారి అధ్వానంగా ఉండటంతో రాకపోకల సమయంలో అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి మంజూరైనట్లు అధికారులు గతంలో తెలిపినా పనులు కార్యరూపం దాచలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

పాఠశాలల బలోపేతానికి కృషి



సీఆర్పీలకు సూచనలు చేస్తున్న ఎంఈఓ-1 నాగభూషణరావు

జియ్యమ్మవలస: స్థానిక ఎమ్మార్సీ భవనంలో ఎంఈఓ-1 నాగభూషణరావు మండలంలో పనిచేసే సీఆర్పీలతో శనివారం సమావేశం నిర్వహించారు. పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ప్రభుత్వం నుంచి వస్తున్న దుస్తులు, షూలు, బెల్ట్‌లు విద్యార్థులకు చేరవేసే బాధ్యత సీఆర్పీలదే అని అన్నారు. సీఆర్పీలు తమకు కేటాయించిన పాఠశాలలో విధిగా హాజరు కావాలన్నారు. అనంతరం అల్లువాడ ఎంపీపీ పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల నోట్‌బుక్స్‌ను పరిశీలించారు. ఉపాధ్యాయులు పాఠాలు బాగా చెపుతున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల రికార్డులు పరిశీలించారు. హెచ్‌ఎం రూపావతి, ఉపాధ్యాయులు ఉన్నారు.

త్రైత సిద్ధాంత ప్రచారం



జి.శివడలో ప్రచారం చేస్తున్న ఇందూజ్ఞాన వేదిక సభ్యులు

కురుపాం: మండలంలోని ఏజెన్సీలో శనివారం త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి ఇందూజ్ఞాన వేదిక సభ్యులు త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేశారు. జి.శివడ, దండుసూర, ధర్మలక్ష్మీపురం గిరిజన గ్రామాల్లో ఆధ్యాత్మిక ప్రచారం నిర్వహించారు. భగవద్గీతలోని పురుషోత్తమ ప్రాప్తి యోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు రామినాయుడు, సభ్యులు గోపాలకృష్ణ, మద్దిరాజు, లక్ష్మీ, మల్లీశ్వరి, కొండమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికీ చేరువకావాలి

భామిని: నీతి అయోగ్ సూచనలతో అమలు చేస్తున్న కార్యక్రమాలు ప్రతి ఒక్కరికీ చేరువయ్యేలా చర్యలు చేపట్టాలని నీతి అయోగ్ కేంద్ర పరిశీలకురాలు అనితా మజ్జి, పార్వతీపురం మన్యం జిల్లా సీపీఓ పి.వీర్రాజు అన్నారు. భామిని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కిశోర్‌కుమార్, మండల కోఆర్డినేటర్ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన సంపూర్ణత అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఏస్పిరేషనల్ బ్లాక్, డిస్ట్రిక్ట్ కార్యక్రమం కింద రాష్ట్రంలో ఎంపికైన మూడు మండలాల్లో భామిని ఒకటని వివరించారు. జూలై నుంచి సెప్టెంబర్ 30 వరకు కేంద్ర ప్రభుత్వ నిధులతో 5 విభాగాల్లో చేపడుతున్న పథకాలు విస్తృతపరచి 40 ఇండికేటర్స్ ద్వారా ప్రగతి గుర్తింపు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసి ప్రకృతి వ్యవసాయ పంటల ప్రదర్శన, నవధాన్యాల చక్రం, విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఈఓ గార పగడాలమ్మ, ఏడీఓ కె.రత్నకుమారి, ఎస్‌పీఎం డీపీఎం షణ్ముఖరాజు, మండల ప్రత్యేక ఆహ్వానితులు తోట సింహాచలం, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మజ్జి మోహనబాబు, జేసీఎస్ కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ప్రవేశాల ప్రక్రియ పూర్తిచేయాలి



హెచ్‌ఎంలకు సూచనలిస్తున్న ఐటీడీఏ డీడీ రుగ్మా గాండయ్య

గుమ్మలక్ష్మీపురం: గురుకుల పాఠశాలలు, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న సీట్లు మేరకు అడ్మిషన్ల ప్రక్రియ పూర్తిచేయాలని పార్వతీపురం ఐటీడీఏ ఉప సంచాలకులు రుగ్మా గాండయ్య అన్నారు. మండలంలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో గుమ్మలక్ష్మీపురం, కొమరాడ మండలాలకు చెందిన హెచ్‌ఎంలు, డిప్యూటీ వార్డెన్లు, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ఎవరికి ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా వెంటనే స్పందించి వైద్య సేవలు అందివ్వాలన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 1, 2 తరగతుల విద్యార్థులు మాత్రమే ఉండాలని, 3,4,5 తరగతుల విద్యార్థులను ఆశ్రమ పాఠశాలల్లో చేర్పించేలా చూడాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ డీఈఓ సీహెచ్ సుగుణ, ఏఎంఓ మోహనరాయుడు, గుమ్మలక్ష్మీపురం ఏటీడబ్ల్యూఓ బి.సురేష్ కుమార్, ఎంఈఓ బి.చంద్రశేఖర్ ఉన్నారు.

చిరుధాన్యాల సాగుపై దృష్టి పెట్టాలి



సూర్యనగరంలో రాగి నాటే విధానాన్ని పరిశీలిస్తున్న సభ్యులు

కురుపాం: ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేయడం ద్వారా రైతులు అధిక దిగుబడులు పొందవచ్చని ఆర్‌వైఎస్ఎస్ ట్రాన్స్‌ఫర్మేషన్ సభ్యుడు ఎస్.రాజారావు రైతులకు సూచించారు. మండలంలోని మంత్రజోల, సూర్యనగరం గిరిజన గ్రామాల్లో నవధాన్యాల సాగు, రాగులు నాటే విధానాన్ని శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం రైతులకు పలు సూచనలు, సలహాలను అందజేశారు. వరి సాగు విస్తీర్ణం తగ్గించి, చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలన్నారు. మార్కెట్లో చిరుధాన్యాలకు మంచి డిమాండ్ ఉందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా చిరుధాన్యాల సాగుకు మద్దతు ధర చెల్లిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ, దేవీప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

జునోసిస్ వ్యాధులపై అవగాహన అవసరం



జియ్యమ్మవలస: చినమేరంగిలో శునకాలకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి మునికుమార్

పాలకొండ రూరల్/గుమ్మలక్ష్మీపురం/జియ్యమ్మవలస/కురుపాం/గరుగుబిల్లి: జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పశువైద్యాధికారులు సూచించారు. ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా శనివారం అన్ని మండలాల్లోని పశువైద్య కేంద్రాల్లో పెంపుడు శునకాలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు ఉచితంగా వేశారు. ఈ సందర్భంగా పశువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. పెంపుడు జంతువులకు సకాలంలో టీకాలు వేయించాలని, ఈ విషయంలో యజమానులు నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. జంతువులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే పశువైద్య సిబ్బందిని సంప్రదించి చికిత్స అందించాలన్నారు.



కురుపాం: పెంపుడు కుక్కలకు టీకాలు వేస్తున్న వైద్యాధికారి శైలజ



గరుగుబిల్లి: కుక్కలకు వ్యాక్సిన్లు వేస్తున్న పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ గణపతిరావు



గుమ్మలక్ష్మీపురం: పశువైద్యశాలలో కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్యాధికారి లక్ష్మణరావు



పాలకొండ రూరల్: పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్యులు

కుక్కిడిలో ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ రవికుమార్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కుక్కిడి గ్రామంలో రాఫా ఫౌండేషన్, మధుశ్రీ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జ్వరం, తలనొప్పి, కీళ్లు, కాళ్లు, ఒళ్లు నొప్పులతో పాటు చర్మ వ్యాధులు, అధిక రక్తపోటు, మధుమేహంతో బాధపడుతున్న సుమారు 52 మంది రోగులకు డాక్టర్ ఎం.రవికుమార్ వైద్య పరీక్షలు చేసి మందులు అవసరమైన వారికి ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ.. గత ఏడాది కాలంలో రాఫా ఫౌండేషన్, మధుశ్రీ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో గిరిజన గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

పింఛన్‌దారుల సమావేశం రేపు

పార్వతీపురం టౌన్: పట్టణంలోని రైతుబజార్ వెనుక గల పింఛన్‌దారుల సమావేశ భవనంలో పింఛన్‌దారులతో సోమవారం సమావేశం నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పింఛన్‌దారుల అసోసియేషన్ కార్యదర్శి గణపతిరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం సబ్‌ట్రెజరీ పరిధిలో గల పింఛన్‌దారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.